

సభలో రేవంత్‌రెడ్డి, షర్మిల సంఘీభావం



సభకు భారీ సంఖ్యలో హాజరైన ఉక్కు ఉద్యోగులు, ప్రజలు

ఉక్కు ప్రైవేటీకరణకు ఒప్పుకోం

» ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ డిక్లరేషన్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రకటించింది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు తాము ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని, తమ ప్రాణాలు అడ్డు పెట్టయినా పోరాడతామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. శనివారం ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన 'న్యాయ సాధన సభ'లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఉక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఎప్పుడు పిలిచినా వెంటనే వస్తానని ప్రకటించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ దేవాలయంలాంటి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ప్రజలు, కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థను కాపాడుకుంటే అన్నివర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశానికి పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అధ్యక్షత వహించగా, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, కనుమూరి బాపిరాజు, తులసీరెడ్డి, రాకేష్‌రెడ్డి, మయ్యప్పన్, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గొంప గోవిందరావు, జెర్రిపోతుల ముత్యాలు, పాశర్ల ప్రసాద్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో పోస్టర్‌ను రేవంత్‌రెడ్డి, షర్మిల ఆవిష్కరించారు.

ఎన్నికల సందడి



» షెడ్యూలు విడుదల
కోడ్ అమలు
» రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదు
» వ్యాపారులకు ముందస్తు అనుమతి తప్పనిసరి

రాత్రి 10 వరకే ఎన్నికల ప్రచారం

» రాత్రి 11 గంటలకు బార్లు మూసివేయాల్సిందే
» ఏప్రిల్ 18న ఎన్నికల ప్రకటన » మే 13న పోలింగ్
» జూన్ 4న కౌంటింగ్

ఎన్నికల షెడ్యూల్	
నోటిఫికేషన్	18-04-2024
నామినేషన్ల గడువు	25-04-2024
నామినేషన్ల పరిశీలన	26-04-2024
ఉపసంహరణ	29-04-2024
పోలింగ్ తేదీ	13-05-2024
ఓట్ల లెక్కింపు, ఫలితాలు	04-06-2024

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నగారా మోగింది. ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు విచ్చలవిడిగా అధికార పార్టీనేతల అడుగులకు మడుగులొత్తిన అధికారులు ఇకపై అలా చేయడానికి వీల్లేదు. వలంటీర్లు స్థానిక నాయకులతో చెట్టపట్టాలేసుకొని తిరిగితే కుదరదు. ఎమ్మెల్యే అభ్యర్థి ఇచ్చారనో, ఎంపీ పంపారనో కానుకలు తీసుకొని ఇంటింటికీ వెళితే... చర్యలకు గురికావలసి ఉంటుంది. వలంటీర్లు ఎన్నికల విధులు, రాజకీయ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించింది.



ఎన్నికల కోడ్ రావడంతో బీచ్ రోడ్డులో వైసీపీ నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

ఎన్నికల సంఘం కొరడా ఝళిపించడం ప్రారంభించింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో శనివారం భద్రతా దళాలు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా, అందులో స్థానిక నాయకుడు ఒకరు ముందుండి నడిచారు. ఆ పక్కనే ఎస్.ఐ. గోవిందరావు ఉన్నా వారించకుండా కలిసి నడవడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. విశాఖ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకంగా రిటర్నింగ్ అధికారిని నియమించారు. భీమిలికి అక్కడి ఆర్‌డీఓ భాస్కరరెడ్డి, విశాఖ తూర్పు నియోజకవర్గానికి జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మణ్‌రెడ్డిని, విశాఖ పశ్చిమకు ఆర్‌డీఓ హుస్సేన్ సాహెబ్‌ను నియమించారు. విశాఖపట్నం పార్లమెంటు నియోజకజవర్గానికి ఆర్‌ఓగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు.

ఏప్రిల్ 18న ఎన్నికల ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న ప్రకటన విడుదల అవుతుంది. ఏప్రిల్ 25 వరకు

... మిగతా 6వ పేజీలో

అమలులోకి ఎన్నికల కోడ్

» వలంటీర్లు, ఉద్యోగులు పార్టీలకు దూరంగా ఉండాలి
» నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
» ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లాలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
» జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు లేవు
» 16వ తేదీ నాటికి జిల్లాలో 19,71,268 మంది ఓటర్లు
» ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

- వివరాలు 6వ పేజీలో

ఎన్నికలకు పోలీస్ కసరత్తు

» అధికారులతో నగర పోలీస్ కమిషనర్ సమీక్ష
» సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరా
» చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం
» నగరంలో కూడా కొత్తగా చెక్‌పోస్టుల ఏర్పాటు
» నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు



విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ విడుదలవ్వడంతో ఎన్నికల నిర్వహణపై నగర పోలీసులు కసరత్తు ప్రారంభించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఇప్పటికే పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారం కూడా ఆయన ఏసీపీ అంతకంటే పైస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నగరంలో అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగితెలుసుకున్నారు. నగర సరిహద్దుల్లో ఇప్పటికే ఏర్పాటుచేసిన ఐదు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, వీడియో రికార్డు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో వాహనాల తనిఖీ చేపట్టేందుకు ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలనే దానిపై ప్రతిపాదనలు తయారుచేయాలని ఏసీపీలను ఆదేశించారు. ఇకపై వాహనాల తనిఖీలు నిరంతరం జరిగేలా చూడడంతోపాటు రాజకీయ నేతల కదలికలు, డబ్బు, మద్యం వంటి రవాణాపై నిఘా పెట్టాలని ఆదేశించారు. పోలింగ్ సమయంలో గొడవలకు దిగేవారు, దొంగ ఓట్లు వేసేందుకు యత్నించేవారు ఎలాంటి కేసులను ఎదుర్కొనాల్సి ఉంటుందనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరానికి ఇప్పటికే మూడు కంపెనీల ప్రత్యేక బలగాలు చేరుకున్నాయని, వాటిని ప్రతి పోలింగ్‌బూత్ పరిధిలోనూ తిప్పడం ద్వారా ఆయా ప్రాంతాలపై

... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.11
సహరి (సోమ)	4.48



బీచ్‌రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న దృశ్యం

నేతల విగ్రహాలకు ముసుగు

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలకు శనివారం షెడ్యూల్ విడుదలైంది. తక్షణం కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో నగరంలోని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించడంతోపాటు నేతల విగ్రహాలకు ముసుగు కప్పే పనిలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. బీచ్‌రోడ్డులోని ఎన్.టి.రామారావు, వైఎస్‌రాజశేఖరరెడ్డితో పాటు పలువురు రాజకీయనేతల విగ్రహాలకు ముసుగు వేశారు.

3 చోట్ల సిట్టింగ్‌లు



అభ్యర్థుల జాబితా విడుదల చేసిన వైసీపీ

» విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి

నాలుగుచోట్ల సమన్వయకర్తలు

» భీమిలి నుంచి ముత్తంశెట్టే
» పెందుర్తి, 'సౌత్' సీట్లపై చివరి వరకూ ఊగిసలాట కొనసాగినా అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్‌కుమార్‌కే అవకాశం
» 'తూర్పు' నుంచి బరిలోకి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
» 'నార్త్' నుంచి మరోసారి కేకే రాజు పోటీ
» 'పశ్చిమ'కు ఆడారి ఆనందకుమార్
» గాజువాకకు గుడివాడ అమర్‌నాథ్



ఎంవీవీ సత్యనారాయణ



ముత్తంశెట్టి శ్రీనివాస్



వాసుపల్లి గణేష్‌కుమార్



గుడివాడ అమర్‌నాథ్



ఆడారి ఆనంద్‌కుమార్



అదీప్‌రాజ్



కేకే రాజు

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఖరారుచేసింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. జిల్లాలో అందరూ ఊహించినట్టుగానే అభ్యర్థులను ప్రకటించారు.

భీమిలి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకే అవకాశం కల్పించారు. తూర్పు నియోజకవర్గం నుంచి సమన్వయకర్తగా కొనసాగుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు టికెట్ కేటాయించారు. ఆయన్ను తిరిగి ఎంపీగా పోటీకి దింపాలని పార్టీ అధిష్ఠానం భావించినప్పటికీ ఎంవీవీ తూర్పు నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేయడానికి ఆసక్తి

... మిగతా 6వ పేజీలో

ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ



విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. సిట్టింగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీకి ఆసక్తి చూపడంతో ఆరు నెలల కిందట ఆయన్ను అక్కడ సమన్వయకర్తగా నియమించింది. అప్పటి నుంచి విశాఖ లోక్‌సభ అభ్యర్థి కోసం అధిష్ఠానం అన్వేషించినప్పటికీ ఎవరూ దొరకలేదు. దీంతో పొరుగున ఉన్న విజయనగరం జిల్లా నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీలక్ష్మిని తీసుకొచ్చి లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించారు. సమన్వయకర్తగా ప్రకటించిన తరువాత కూడా ఆమె చాలాకాలం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. ఆమెను మార్చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. అయితే అర్థబలం ఉన్నవారెవరూ దొరక్కపోవడంతో ఆమె పేరును అధిష్ఠానం ఖరారు చేయాల్సి వచ్చింది.

వాసుపల్లి వద్దంటూ నిరసన



వాసుపల్లికి వ్యతిరేకంగా మత్స్యకారుల నినాదాలు

మహారాణిపేట, మార్చి 16: దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వైసీపీ టికెట్ ఖరారు చేయడాన్ని నిరసిస్తూ మత్స్యకారులు శనివారం ఆందోళన చేపట్టారు. ఫిషింగ్ హార్బర్ వద్ద సమావేశమై వాసుపల్లి మాకొద్దంటూ నినాదాలు చేశారు. మత్స్యకార సామాజికవర్గానికే చెందిన వాసుపల్లి జానకీరామ్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వాసపల్లిని ఓడించి తీరుతామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో మోహిత్ ప్రతిభ

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 16: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ టోర్నీలో ఏయూకు ప్రాతినిధ్యం వహించిన ఆర్‌వీఎస్‌కే మోహిత్ రజత పతకం సాధించాడు. మీరట్‌లో జరిగిన టోర్నీ ఫైనల్స్‌లో 57 కిలోల విభాగంలో మోహిత్ ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా వాడోకై కరాటే సంస్థల చీఫ్ చిగురుపల్లి సతీష్‌కుమార్ శనివారం మోహిత్‌కు రూ.పది వేల బహుమతిని అందజేశారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు

సీతంపేట, మార్చి 16: గ్లకోమా అవగాహన వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాల్లో ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్లకోమాపై విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. డాక్టర్ రమణ, ఆర్ ఎంఓ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ వాణీశ్రీ, డాక్టర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధంపై కోట వీధి వాసుల ఆందోళన

- పోర్టు ట్రస్ట్ చర్యలపై నిరసన తెలిపిన స్థానికులు
- ఏప్రిల్‌కు పరిస్థితి చక్కదిద్దుతామని హామీ ఇచ్చిన పోర్టు అధికారులు

జగదాంబ కూడలి, మార్చి 16: ఫెర్రీ రోడ్డులో మురుగునీరు నిల్వ ఉండిపోవడానికి, ఈ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారేందుకు పోర్టు ట్రస్టు అధికారుల చర్యలే కారణమని స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు వన్‌టౌన్ కోటవీధి ప్రాంతవాసులు శనివారం ఆందోళనకు దిగారు. పోర్టు ట్రస్ట్ కన్వేయర్ బెల్ట్, ఫెర్రీరోడ్డు వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న స్థానికులు రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ చేపడుతున్న పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆందోళనను పోర్టు సీఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. ఫెర్రీ కాలువ వద్ద గఫూర్ (లడ్డా) చేపడుతున్న పనుల కారణంగా గత కొద్దినెలలుగా కాలువలోని మురుగునీరు దిగువకు పోకుండా బ్లాక్ చేశారని, దీనివల్ల తీవ్రమైన దుర్గంధం వ్యాపించి, ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పోర్టు, జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం కనిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో భయంకరమైన దుర్గంధం వ్యాపించడమే కాకుండా, దోమలు విజృంభించి డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబాలతో సహా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు రహదారిపై నుంచి లేచేది లేదని, తక్షణం ఫెర్రీ రోడ్డు వద్ద పోర్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు స్థానికులు చేపట్టిన ఆందోళనతో పోర్టు అధికార వర్గాలు దిగివచ్చాయి. ఏప్రిల్ నాటికి కాలువ వద్ద పనులు పూర్తి చేయిస్తామని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని నివాసితులకు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన కారులు శాంతించారు.



కోటవీధి ఫెర్రీ రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

కనకమహాలక్ష్మికి తులసి దళార్చన



తులసి దళార్చనలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పూర్ణామార్కెట్, మార్చి 16: వన్‌టౌన్ బురుజుపేటలో వెలిసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం తులసి దళార్చన సేవలు నిర్వహించారు. ఇప్పటివరకు ప్రతి గురువారం నిర్వహించే ఈ సేవను ఇటీవల అధికారులు శనివారానికి మార్చారు. ఉభయదాతలతో అర్చకులు అమ్మవారికి తులసి దళాలతో పూజలు చేయించారు. కాగా ఈ సేవలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,500 టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని, దంపతులు పూజలో పాల్గొవచ్చని ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పరస

కంచరపాలెం, మార్చి 16: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం వేంకటేశ్వరస్వామి పరస మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది.ఆ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చామర్తి శంకర, జగన్నాధశర్మ, రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు జరిపారు.కంచరపాలెం పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.పరస సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరి అమ్మవారి ఆదివాసం

డాబాగార్డెన్స్, మార్చి 16: సబ్బవరం మండలం యాతపాలెం భువనేశ్వరి అమ్మవారికి ఈ నెల 17న ఆదివారం రావి దళాలతో ఆదివాస ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు స్వయంగా అమ్మవారిని పసుపు, కుంకుమలతో పూజించవచ్చన్నారు.

వైసీపీ బీసీలకు ద్రోహం చేసే పార్టీ

- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



మాట్లాడుతున్న మూర్తియాదవ్, బీజేపీ నేతలు

సీతంపేట, మార్చి 16: నగరంలో మెజారిటీ సామాజికవర్గం యాదవులకు వైసీపీ మొండి చేయి చూపిందని, జగన్ దృష్టిలో బీసీలు అంటే బ్యాక్ బెంచ్ స్టూడెంట్స్‌లా కనిపిస్తున్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విమర్శించారు. పౌరగ్రంథాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ బీసీలకు ద్రోహం చేసే పార్టీ అని ఎద్దేవా చేశారు. యాదవులకు విశాఖలో ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ద్రోహం చేశారన్నారు. వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను బాధ పెట్టారని, అక్కరమాని విజయనిర్మలను నమ్మించి ద్రోహం చేశారని, ఉరుకూటి చందును టికెట్ ఇచ్చే ముందు రోజు తప్పించారన్నారు. మేయర్‌కు గాజువాక సీటు ఇస్తామని నమ్మించారన్నారు. ఉత్తరాంధ్ర యాదవులంతా ఏకమై వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నేత బొట్టా వెంకటరమణ, బీజేపీ నాయకురాలు గంకల కవిత, గంకల అప్పారావు, బుద్దల అనురాధ పాల్గొన్నారు.

వైసీపీకి మాజీ కార్పొరేటర్ జ్యోతి రాజీనామా

జగదాంబ కూడలి, మార్చి 16: దక్షిణ నియోజవర్గం వైసీపీ టికెట్‌ను వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆపార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు శనివారం పార్టీ అధినేత జగన్‌కు లేఖ రాశారు. పార్టీ అభివృద్ధికి ఏళ్లగా కృషిచేస్తున్నా జీవీఎంసీ 30వ వార్డు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా టికెట్ ప్రకటించినా వాసుపల్లి కుట్ర పన్ని వేరొకరికి కేటాయించారన్నారు. అయినా విజయసాయిరెడ్డి హామీ మేరకు పార్టీలో కొనసాగుతున్నానన్నారు. ఎస్సీ మహిళనైన తాను రాజకీయంగా ఎదిగితే తన ఉనికికే ప్రమాదమన్న దురాలోచనతో వాసుపల్లి తనను అణచివేస్తున్నారన్నారు. వాసుపల్లి నీచ రాజకీయాలతో నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని గుర్తుచేశారు. తన అనుచరులు కూడా పార్టీని వీడుతారన్నారు.

ఎన్నికల సందడి

... 5వ పేజీ తరువాయి

నామినేషన్లు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలిస్తారు. అభ్యర్థుల ఉపసంహరణకు 29 వరకు అవకాశం ఉంది. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎన్నికల ప్రక్రియ మొత్తం పర్యవేక్షిస్తారు. ఇది 24/7 పనిచేస్తుంది. జిల్లాలో 19,71,268 లక్షల మంది ఓటర్లున్నారు. నామినేషన్ల విత్‌డ్రా తేదీకి పది రోజుల ముందు వరకు అంటే ఏప్రిల్ 19 వరకు అర్హులనుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎవరైనా ఉంటే ఫారం-6 దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1991. అదనంగా అనుబంధ కేంద్రాలు మరో 50 ఉన్నాయి.

నగదు రవాణాపై ఆంక్షలు

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నగదు రవాణాపై ఆంక్షలు ఉంటాయి. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి తీసుకువెళ్లకూడదు. వ్యాపార అవసరాల కోసం తీసుకెళితే ముందుగానే అనుమతి తీసుకోవాలి. బ్యాంకు లావాదేవీలపైనా పరిశీలన ఉంటుంది. పది లక్షలు అంతకు మించి అకౌంట్ నుంచి బదిలీ అయినా, జమ అయినా ఎక్కడికి వెళ్లింది?, అనేది ఆరా తీస్తారు. వివరాలు ఐటీశాఖకు పంపుతారు.

ప్రచారంపై ఆంక్షలు

ఎన్నికల ప్రచారం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతిస్తారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, ఇతర ఆస్తులపై ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉంటే తొలగించాలి.

- నామినేషన్లు వేసే వరకు అయ్యే ప్రచార వ్యయాన్ని పార్టీల ఖాతాలో వేస్తారు. ఆ తరువాత అభ్యర్థి ఖాతాలో వేస్తారు. కలెక్టర్ చెప్పిన వివరాల ప్రకారం ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు వరకు ఖర్చు పెట్టవచ్చు.
- మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఎవరైనా సరే ప్రభుత్వం కేటాయించిన వాహనాన్ని వారి ఇంటి నుంచి కార్యాలయం వరకు మాత్రమే ఉపయోగించాలి. ఇతర కార్యక్రమాలకు వాడకూడదు. అలా చేస్తే నిబంధనలు అతిక్రమించినట్టే.
- ప్రభుత్వ అతిథిగృహాలు, కార్యాలయాలను రాజకీయ కార్యక్రమాలకు ఇవ్వకూడదు. ఉపయోగించకూడదు.
- సోషల్ మీడియాలో వచ్చే వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. మత, కులపరమైన అంశాల జోలికి వెళ్లకూడదు.
- మోడల్ కోడ్ అమలును పరిశీలించడానికి జిల్లాలో 94 బృందాలు పనిచేస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, అర్బన్‌లో జోనల్ కమిషనర్లు పర్యవేక్షకులు.

ఐదు చెక్‌పోస్టులు

జిల్లాలో తనిఖీల కోసం ఐదు చెక్‌పోస్టులు పెట్టారు. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఉన్నాయి. అవసరమైతే చెక్‌పోస్టుల సంఖ్య పెంచుతారు. ఆకస్మిక తనిఖీలు కూడా ఉంటాయి. నగదు, మద్యం తరలింపుపై నిత్యం నిఘా ఉంటుంది. ఎవరి దగ్గర ఆయుధాలు ఉంచుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే చాలామందితో డిపాజిట్ చేయించారు. ఇంకా ఎవరైనా చేయకపోతే వెంటనే సరెండర్ చేయాలి.

రాజకీయ సభలకు అనుమతి తప్పనిసరి

రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. ఇప్పటివరకు అధికార పార్టీకే అన్ని రకాల అనుమతులు ఇచ్చి, ప్రతిపక్ష పార్టీలకు నిరాకరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇకపై అలా పక్షపాతంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు చేపడుతుంది. గతంలో చేసినట్టు ఇప్పుడు చేయడానికి లేదు.

ఎన్నికలకు పోలీస్ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

వారికి అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రచారం నిర్దిష్ట సమయంలోగా ముగించాలని రాజకీయ పార్టీల నేతలకు సూచించాలని, నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే నిష్పక్షపాతంగా కేసులు నమోదుచేయాలని అధికారులకు స్పష్టంచేశారు. నగరంలో ఎంతమందికి ఆయుధాలకు లైసెన్స్ జారీ చేశారనే దానిపై ఆరా తీసిన సీపీ వాటన్నింటినీ పోలింగ్ ముగిసేంత వరకూ స్థానిక స్టేషన్‌లో డిపాజిట్ చేసేలా నోటీసులు జారీచేయాలన్నారు. వాటిని డిపాజిట్ చేసేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ల సీఐలదేనని సీపీ స్పష్టంచేశారు. ఇకపై ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేందుకు పోలీస్ శాఖా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై అందరూ దృష్టిసారించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

3 చోట్ల సిట్టింగ్‌లు

... 5వ పేజీ తరువాయి

చూపారు. దీంతో ఆయన్ను ఆరు నెలల కిందట తూర్పు నియోజకర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆయనకే టికెట్ ఖరారుచేశారు. దక్షిణ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు టికెట్ కేటాయించారు. గత ఎన్నికల్లో వాసుపల్లి టీడీపీ నుంచి గెలిచినప్పటికీ పార్టీ ఫిరాయించారు. అప్పటికే దక్షిణలో నాయకులుగా చలామణి అవుతున్న ద్రోణంరాజు శ్రీవాత్సవ్, సీతంరాజు సుధాకర్ వాసుపల్లితో విభేదిస్తూ వచ్చారు. వైసీపీ కార్పొరేటర్లు కూడా వాసుపల్లికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శలు గుప్పించేవారు. ఈ క్రమంలో వాసుపల్లికి టికెట్టు అనుమానమేనని ప్రచారం జరిగింది. అధిష్ఠానం ఊగిసలాడినప్పటికీ చివరికి ఆయనకే ఖరారు చేసింది. ఉత్తర నుంచి కేకే రాజుకు మళ్లీ అవకాశం ఇచ్చింది. గత ఎన్ని కల్లో కేకే రాజు స్వల్ప తేడాతో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతూ వచ్చారు. ఆయనకే రెండోసారి అవకాశం ఇచ్చింది. ఇక గత ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేసి తర్వాత వైసీపీలో చేరిన ఆడారి ఆనంద్ కుమార్‌కు పశ్చిమ టికెట్ కేటాయించింది. గాజువాక నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బరిలోకి దిగనున్నారు. అమర్‌నాథ్ గత ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనకు రెండేళ్ల కిందట మంత్రి పదవి లభించింది. అనకాపల్లిలో గెలిచే పరిస్థితి లేదని తేలడంతో మలసాల భరత్‌ను సమన్వయకర్తగా నియమించింది. అమర్‌నాథ్ చోడవరం, ఎలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో పోటీ చేయాలని ఆసక్తి చూపినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. ఇదే సమయంలో గాజువాకలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిపై వ్యతిరేకత ఉందని అధిష్ఠానం అమర్‌నాథ్ సూచన మేరకు 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు)ను సమన్వయకర్తగా నియమించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, సమన్వయకర్తగా నియమితుడైన చందూకు మధ్య విభేదాలు తారస్థాయికి చేరడంతో అమర్‌నాథ్‌ను ఐదు రోజుల కిందటే సమన్వయకర్తగా నియమించింది. పెందుర్తి నుంచి ఎవరిని పోటీకి దింపుతారనేదానిపై ఉత్కంఠ నెలకొన్నప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌నే పోటీకి దింపాలని నిర్ణయించింది.

రెండోసారి బరిలోకి: పెందుర్తి: పెందుర్తి నుంచి వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మరోసారి పోటీ చేయనున్నారు. ఇరవై మూడేళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చిన అదీప్‌రాజ్ 2006లో పెందుర్తి మండలం రాంపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2007లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. గండి బాబ్జీ, కొణతాల వైసీపీలో చేరడంతో అదీప్‌రాజ్ వారిని అనుసరించారు. గండి బాబ్జీ వైసీపీకి రాజీనామా చేయడంతో నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో బండారుపై విజయం సాధించారు.

CLASSIFIEDS

వచ్చే ఎన్నికల్లో కూటమిదే విజయం

- మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 16: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని విశాఖ విభిన్న ప్రతిభావంతుల కమిటీ అధ్యక్షుడు ఇసరపు వాసు అన్నారు. పార్టీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయం నుంచి చిలకలూరిపేటలో జరగనున్న సభకు శనివారం బయలుదేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇసరపు అప్పారావు, నమ్మి రవి కుమార్, నరాల బాలకృష్ణ, నారా కిషోర్, శంకర్, వెంకటలక్ష్మి, పార్వతి, సూర్యప్రకాశ్, చంద్రరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం ప్రారంభించిన వంశీకృష్ణ



ఎన్నికల ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: దక్షిణ నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 29వ వార్డు దండుబజారు జంక్షన్ నుంచి ప్రారంభమై ముందుగా సంపత్ వినాయకుని ఆలయం, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, బెల్లం వినాయకుని ఆలయంలో పూజలు చేశారు. జనసేన నాయకులు, యువత, వీరమహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు, దండుబజారు, చంఢకవీధి, అంగటిదిబ్బ, రామజోగిపేట మీదుగా కేజీహెచ్ డౌన్ అవుట్ గేట్ వరకు ర్యాలీ సాగింది. జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, పసుపులేటి ఉషా కిరణ్, బొలిశెట్టి సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు నిరుపమానం





కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల, ఈపీడీసీఎల్ కార్యాలయంలో అమరజీవికి నివాళి

కంచరపాలెం, మార్చి 16: తెలుగు జాతి ఔన్నత్యం కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి, సేవలు నిరుపమానమని కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కావడానికి శ్రీరాములు కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో..

సీతమ్మధార: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం పూలమాల వేసి నివాళి అర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, జె.శ్రీనివాసరావు, రవికుమార్, ఎం.మసిలిమణి, ఎం.రవీంద్ర, కార్పొరేటర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమలులోకి ఎన్నికల కోడ్

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినందున కోడ్ అమలులోకి వచ్చేసిందని, దానిని అంతా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం నుంచే ప్రవర్తన నియామవళి అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని స్పష్టంచేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులు, తాజా పనులకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను 72 గంటల్లో ఎన్నికల సంఘానికి పంపుతామన్నారు. ప్రభుత్వ భవనాలు, వాహనాల వినియోగం, ఎన్నికల వ్యయం, ప్రొటోకాల్ తదితర వ్యవహారాలన్నీ నియమావళికి లోబడి ఉంటాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల ఫొటోలు తొలగించాలని ఆదేశించామన్నారు. జిల్లాలో ఎక్కడా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు లేవని, క్లిష్టమైన కేంద్రాలు మాత్రం 478 గుర్తించామని చప్పారు. జిల్లాలో 1,941 పోలింగ్ కేంద్రాలు, మరో 50 అనుబంధ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. ఈ నెల 16వ తేదీ నాటికి జిల్లాలో 19,71,268 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశామన్నారు. పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో వచ్చిన రాజకీయ ప్రకటనలు పరిశీలించేందుకు ఎంసీఎంసీ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్ఓ కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రమాద స్థలిలో మంటలు

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో ప్రమాదం

నేలపాలైన ద్రవపు ఉక్కు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: స్టీల్‌ప్లాంట్‌లోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2లో శనివారం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. విభాగంలోని ఎల్‌బీ బేలో ద్రవపు ఉక్కు తీసుకువెళుతున్న ల్యాడిల్ కింద భాగానికి రంధ్రం పడడంతో అందులో ఉన్న ద్రవపు ఉక్కు నేలపాలయింది. ఆ సమయంలో అక్కడ స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం వల్ల ఉక్కు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

సెల్ ఫోన్ల దొంగ అరెస్టు

కూర్మన్నపాలెం, మార్చి 16: రైళ్లలో, ఫుట్‌పాత్‌పై ప్రయాణం చేస్తున్న పలువురి నుంచి సెల్ ఫోన్లను చోరీ చేసిన అగనంపూడికి చెందిన గాడి అప్పారావు అనే యువకున్ని శనివారం జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు, ఎస్ఐ కె.శాంతారామ్‌లు అదుపులోకి తీసుకుని తనదైన శైలిలో విచారించారు. నిందితుని వద్ద నుంచి రూ.65 వేల విలువ చేసే 13 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తారురోడ్డు, కల్వర్టులు ప్రారంభం

పెందుర్తి-రూరల్, మార్చి 16: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం నుంచి లక్ష్మీపురం వసంత గార్డెన్స్ వరకు నిర్మించిన తారురోడ్డు, కల్వర్టులు, డ్రైనేజీలను కార్పొరేటర్ ముమ్మన దేముడు శనివారం ప్రారంభించారు. అలాగే పాపయ్యరాజుపాలెంలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూ కల్వర్టు, భవానీనగర్‌లో నిర్మించిన ఆర్‌ఈసీ బాక్స్ కల్వర్టు, సాయిసాదనగర్ నుంచి లక్ష్మీపురం వాటర్ ట్యాంకు వరకు నిర్మించిన డ్రైనేజీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అయిత ఎర్రయ్య, కంచిబోయిన సంతోష్, పి.లక్ష్మణ్, పీడీ ప్రసాద్, దువ్వి అప్పారావు, కేవీఆర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు పంపిణీ

అగనంపూడి, మార్చి 16: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతులైన 65 మందికి ప్రతినెలా మాదిరిగానే ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లు అందజేశారు. అలాగే పలు పేద కుటుంబాలకు నిత్యావసర సరకులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఆదపలో ఉన్న పేదలకు ఆదుకోవడమే ధ్యేయంగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరావు, మస్తాన్‌రెడ్డి, జామి గణేశ్, జి.వెంకటరమణ, ఎల్.రాము, కె.హనుమంతరావు, పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవల్లో ఏబీఏపీ ముందంజ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 16: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టడంలో అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) ముందుండడం అభినందనీయమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైలా ఆదిమోహన్‌రెడ్డి అన్నారు. షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం జరిగిన ధర్మ ప్రచార సభ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జి.రాజేశ్వరరావు, తాతినాయుడు, నాగార్జున, బి.చినఅప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్షునిగా శీలంశెట్టి ఈశ్వరరావు, ఉపాధ్యక్షునిగా నంబారు రాజు, కార్యదర్శిగా ఎం.గురునాయుడు, సహాయ కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా అల్లు నరహరి ఎంపికయ్యారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 22, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 21, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 30, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 90, కీరదోస 24, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	196
స్కిన్‌లెస్	--	206

టీడీపీతోనే రాష్ట్రానికి మంచి రోజులు

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

సింధియా, మార్చి 16: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని, వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలతో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక అమలు చేస్తారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి టీడీపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా గణబాబుకు మహిళలు హారతులిచ్చి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేపట్టిన ప్రచార ర్యాలీ క్రాంతినగర్ నుంచి చింతలలోవ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్నా, సీనియర్ నాయకులు బొండా కృష్ణ, అమెరికా శ్రీను, జెర్రిపోతుల నరసింగరావు, పుక్కల్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గణబాబుకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

వైసీపీ రాక్షస పాలనకు ముగింపు ఆరంభం

గోపాలపట్నం: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గోపాలపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వైసీపీ రాక్షస పాలనకు ముగింపు ఆరంభమైందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకూడదు

విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్

ఆటోనగర్, మార్చి 16: యువశక్తి దేశానికి ఎంతో అవసరమని, అందువల్ల నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ సూచించారు. 88వ వార్డు పరిధి గ్రీన్‌సిటీలో శనివారం సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధకం (యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో కిశోర్‌కుమార్ ప్రమాణం చేయించారు. విశ్రాంత జడ్జి పైలా సన్నిబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి యువత పోరాదన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ పుస్తకాల్లో ఉన్నవి సత్యాలైతే.. జీవిత అనుభవాలు నగ్నసత్యాలన్నారు. డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపకపోతే విద్యార్థుల జీవితం అంధకారమవుతుందన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ నేటి యువత హాబీస్ కోసం మత్తు పదార్థాల జోలికి వెళితే జీవితాలు దుర్భరంగా మారుతాయని పేర్కొన్నారు. కోస్టల్ ఆంధ్రా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నరవ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ నిత్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దాస్, సురేశ్, నాయుడు, శ్రీనివాసరావు, కె.మణి, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, తదితరులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కిశోర్‌కుమార్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బెహరా, తదితరులు



పెదగంట్యాడలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు

పలుచోట్ల ఘనంగా అమరజీవి జయంతి

గోపాలపట్నం, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెహరా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ 91, 92 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక సత్రం జంక్షన్‌లోని మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలన్నారు. సంస్థ ప్రతినిధులు మస్తాన్‌రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటరావు, రామునాయుడు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగధనులని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ అన్నారు. ఇక్కడి గ్రంథాలయ ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. గ్రంథాలయ సిబ్బంది, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రమణ, సోమునాయుడు, నాగరాజు, అప్పలరెడ్డి, తదితరులు అలాగే స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి పీవీ రమణ, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: వడ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఆర్యవైశ్య సంఘ సభ్యులు నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేశ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిపెట్టిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. సంఘ ప్రతినిధులు ఎం.వెంకటరమణ, కె.మధుసూధనశెట్టి, లింగేశ్వరరావు, కె.వీర్రాజు, రామకృష్ణ, పాల్గొన్నారు.





నాయుడుతోటలోని శేషాద్రి కొండపై కల్యాణ వేంకటేశ్వరుని కల్యాణాన్ని జరుపుతున్న అర్చకులు... పక్కన ఎస్టీబీఎల్‌లో ఉభయ దేవేరులతో పూజలందుకున్న శ్రీవారు

కమనీయం కల్యాణ వేంకటేశ్వరుని కల్యాణం

వేపగుంట, మార్చి 16: నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి శ్రీవారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగ సమర్పణ, అష్టోత్తర శత కలశాభిషేకం, ములవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రాప్తి, శత్రు విజయం కోసం సుదర్శన హోమం జరిపారు. మధ్యాహ్నం తిరువీధి ఉత్సవాన్ని కోలాటాల నడుమ నిర్వహించారు. కాగా శ్రీవారిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకొని పూజలు చేశారు. కల్యాణ్ణా ఆలయ అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్ చినజీయర్‌స్వామి పీఠం నుంచి వచ్చిన అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ఆలయ సేవకులు భాను, ఆదినారాయణరావు, కృష్ణమూర్తి, వర్మ, సన్యాసిరావు, శ్రీను, శ్రీహరి, తదతరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్ దివ్యక్షేత్రంలో శ్రీవారికి పూజలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువ జామున స్వామివారిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో తోమాలసేవ నిర్వహించారు. సాయంత్రం దివ్యక్షేత్రంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి వివిధ రకాల పుష్పాలతో సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, శాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపారు.





రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.. పక్కన ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న షర్మిల

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం

గోపాలపట్నం, మార్చి 16: ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో శనివారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నగరానికి చేరుకున్నారు. సాయంత్రం ఎయిర్ ఇండియా విమానంలో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం గుండా తృష్ణా మైదానానికి బయలుదేరి వెళ్లారు. కాగా మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న షర్మిలకు కాంగ్రెస్ నాయకులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

ధ్యాన మందిర నిర్మాణానికి భూమి పూజ

పెందుర్తి, మార్చి 16: మండలంలోని వాలిమెరక జుత్తాడలో యోగాభ్యాసకులు శంకరరావు ఆధ్వర్యంలో నిర్మించనున్న అహం బ్రహ్మాస్మి మహేశ్వర జ్ఞాన ధ్యాన మందిరానికి శనివారం భూమి పూజ చేశారు. రుత్వికులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, గౌడ రెడ్డి, సౌజన్య, సాయి, శరణ్, తదితరులు పాల్గొన్నారు

కేంద్ర ఉక్కు శాఖ జాయింట్ సెక్రటరీకి వినతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసిన కేంద్ర ఉక్కు శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ సంజయ్ రాయ్‌కు శనివారం ఉక్కు అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా విశాఖ ఉక్కుకు తగిన ఇనుము ముడి ఖనిజం, ఎన్ఎండీసీ కిరండోలు, బచేలీ నుంచి, థర్మల్ బొగ్గు మహానది కోల్డ్ ఫీల్డ్ నుంచి తగినంతగా సరఫరా జరగడం లేదన్నారు. దీనివల్ల అదనంగా రూ.ఏడు వేలు ఉత్పత్తి వ్యయం అవుతుందని, ఇదే నష్టాలకు కారణమన్నారు. ఈ ముడి ఇనుప ఖనిజం కనీసం 50 శాతం కూడా రాకపోవటంతో 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేయడం జరిగిందన్నారు. గత డిసెంబరులో దీనిని తెరిచినా ఉత్పత్తి సామర్థ్యం 60 శాతం మాత్రమే చేస్తున్నామన్నారు. అలాగే రైల్వే ర్యాక్స్ అధికారుల ప్రమోషన్లు, వేతన సవరణ, పీఆర్పీ చెల్లింపు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరణంరెడ్డి, తదితరులు

‘ఉమ్మడి అభ్యర్థి ‘పల్లా’ గెలుపే లక్ష్యం కావాలి’

గాజువాక, మార్చి 16: బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. 70వ వార్డు పరిధిలోని పంతులుగారి మేడ వద్దనున్న బీజేపీ కార్యాలయంనకు శనివారం పల్లా శ్రీనివాసరావు విచ్చేసి తనకు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులను కోరారు. ఆయనకు కరణంరెడ్డి, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువా కప్పి సత్కరించారు. సైకో జగన్ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో తనను గెలిపించవలసిందిగా పల్లా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీను, సోంబాబు, ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ రౌతు శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు అభినందనలు

ఆటోనగర్: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును శనివారం తెలుగుదేశం పార్టీ 70వ వార్డు సీనియర్ నాయకుడు పీఎంఎల్ నాయుడు ఆధ్వర్యంలో పలువురు డాక్‌యార్డు ఉద్యోగులు కలసి అభినందనలు తెలిపారు. కాగా గాజువాక నియోజకవర్గంలో తన విజయానికి జనసైనికులు, నాయకులు సహకరించవలసిందిగా పల్లా జనసేన నాయకుడు కోన తాతారావును కలిసి మద్దతు కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు లంకల మురళీదేవి, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, జి.శ్రీనివాసరావు, సహదేవరావు, జి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో పోలీసుల కవాతు



గాజువాక మెయిన్ రోడ్డులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గాజువాక, మార్చి 16: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని గాజువాక మెయిన్ రోడ్డుతో పాటు పట్టణ పురవీధుల్లో శనివారం పోలీసులు కవాతు నిర్వహించారు. గాజువాక నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని ప్రాంతాల్లో కేంద్ర రక్షణ బలగాలతో పాటు రాష్ట్ర పోలీసులు కవాతు నిర్వహిస్తునారు. కాగా ఇప్పటికే పలు కీలక జంక్షన్లలో పోలీస్ పికెట్లను కూడా ఏర్పాటు చేశారు.

స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదు

పీసీసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



సభలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: ఎంతో మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ జోలికి వస్తే సహించేది లేదని పీసీసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి హెచ్చరించారు. ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో శనివారం జరిగిన కాంగ్రెస్ న్యాయ సాధన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు నాశనం చేశాయన్నారు. అధికారంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించాలని కోరారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని భావించి నాటి ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ వాటిని స్థాపించారన్నారు. కానీ నేటి ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలకు తమ అనుయాయులకు కారుచౌకగా కట్టబెడు తున్నారని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేస్తే తొలి సంతకం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఫైలుపైనే చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు మాట్లాడుతూ మన పోరాటాలు కేంద్రానికి తాకాలన్నారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. కాంగ్రెస్ పాలన స్వర్ణయుగమని పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం స్థాపన కోసం కాంగ్రెస్ చేసిన కృషి విశేషమైనదన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఉక్కు ప్రైవేటీకరణపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రేమలేఖలు రాస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రజల ఆస్తి అని, అయితే దీనిని మోదీ కార్పొరేట్లకు విక్రయించాలని చూడడం దారుణమన్నారు. మరో చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో అన్ని రంగాలు ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రజల ఆస్తి అయిన స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే ఊరుకోమన్నారు.

భారీగా హాజరైన ప్రజలు

ఉక్కుటౌన్‌షిప్/గాజువాక: ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో జరిగిన కాంగ్రెస్ సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా సంఖ్యలో హాజరయ్యారు. సభా ప్రాంగణంలో వేసిన కుర్చీలు చాలకపోవడంతో ఎంతోమంది బయటే వేచి ఉన్నారు. వేల సంఖ్యలో ప్రజలు వాహనాలపై వచ్చారు. సాయంత్రం ఐదున్నర తర్వాత ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో సహా అధిక సంఖ్యలో తరలివచ్చారు. కూర్మన్నపాలెం కూడలి నుంచి తృష్ణా మైదానం వరకు భారీ ర్యాలీగా వెళ్లారు. డప్పులు వాయిస్తూ డ్యాన్స్‌లు చూస్తూ ముందుకు సాగారు.

వినతిపత్రాలు అందజేత

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, వివిధ సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. ఉక్కు ఉద్యమాలకు సహకారం అందించాలని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే స్టీల్‌ప్లాంట్‌లో నెలకొన్న సమస్యలు, నిర్వాసితుల ఇబ్బందులపై వినతిపత్రాలు అందించారు.

పదో తరగతి పరీక్షలకు పాఠశాలలు సిద్ధం

కూర్మన్నపాలెం, మార్చి 16: పదో తరగతి పరీక్షలను ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 11 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు పది రూమ్‌లను సిద్ధం చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కనీసం గంట ముందు ఆయా కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. విద్యార్థులను ఉదయం ఎనిమిదిన్నర నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. పరీక్షలు ప్రారంభమైన అరగంట వరకు అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ముందు రోజే ఆయా పరీక్ష కేంద్రాలకు వెళ్లి చూసుకోవాలన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు: 12 మందికి గాయాలు

చోడవరం, మార్చి 16: పట్టణ శివారులో ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలో ఉన్న 12 మంది గాయపడ్డారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక దరి లంకెలపాలెం మారేడుపూడి కాలనీ నుంచి 12 మంది పట్టణంలోని ఓ ఫంక్షన్‌కు శనివారం ఆటోలో వచ్చారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, పట్టణ శివారు బీఎన్ రోడ్డులో ఎదురుగా అనకాపల్లి నుంచి వస్తున్న కారు ఈ ఆటోను బలంగా ఢీకొనడంతో పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 12 మందిలో ఇద్దరికి తీవ్రంగా, పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసు వాహనాల్లో ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేశాక తీవ్రంగా గాయపడిన వారిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ లక్ష్మీజిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వాసుపల్లి వద్దంటూ నిరసన



వాసుపల్లికి వ్యతిరేకంగా మత్స్యకారుల నినాదాలు

మహారాణిపేట, మార్చి 16: దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వైసీపీ టికెట్ ఖరారు చేయడాన్ని నిరసిస్తూ మత్స్యకారులు శనివారం ఆందోళన చేపట్టారు. ఫిషింగ్ హార్బర్ వద్ద సమావేశమై వాసుపల్లి మాకొద్దంటూ నినాదాలు చేశారు. మత్స్యకార సామాజికవర్గానికే చెందిన వాసుపల్లి జానకీరామ్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వాసపల్లిని ఓడించి తీరుతామని ప్రతిన బూనారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో మోహిత్ ప్రతిభ

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 16: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ టోర్నీలో ఏయూకు ప్రాతినిథ్యం వహించిన ఆర్‌వీఎస్‌కే మోహిత్ రజత పతకం సాధించాడు. మీరట్‌లో జరిగిన టోర్నీ ఫైనల్స్‌లో 57 కిలోల విభాగంలో మోహిత్ ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా వాడోకై కరాటే సంస్థల చీఫ్ చిగురుపల్లి సతీష్‌కుమార్ శనివారం మోహిత్‌కు రూ.పది వేల బహుమతిని అందజేశారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు

సీతంపేట, మార్చి 16: గ్లకోమా అవగాహన వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాల్లో ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్లకోమాపై విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. డాక్టర్ రమణ, ఆర్ ఎంఓ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ వాణీశ్రీ, డాక్టర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధంపై కోట వీధి వాసుల ఆందోళన

- పోర్టు ట్రస్ట్ చర్యలపై నిరసన తెలిపిన స్థానికులు
- ఏప్రిల్‌కు పరిస్థితి చక్కదిద్దుతామని హామీ ఇచ్చిన పోర్టు అధికారులు

జగదాంబ కూడలి, మార్చి 16: ఫెర్రీ రోడ్డులో మురుగునీరు నిల్వ ఉండిపోవడానికి, ఈ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారేందుకు పోర్టు ట్రస్టు అధికారుల చర్యలే కారణమని స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు వన్‌టౌన్ కోటవీధి ప్రాంతవాసులు శనివారం ఆందోళనకు దిగారు. పోర్టు ట్రస్ట్ కన్వేయర్ బెల్ట్, ఫెర్రీరోడ్డు వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న స్థానికులు రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ చేపడుతున్న పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆందోళనను పోర్టు సీఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. ఫెర్రీ కాలువ వద్ద గఫూర్ (లడ్డూ) చేపడుతున్న పనుల కారణంగా గత కొద్దినెలలుగా కాలువలోని మురుగునీరు దిగువకు పోకుండా బ్లాక్ చేశారని, దీనివల్ల తీవ్రమైన దుర్గంధం వ్యాపించి, ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పోర్టు, జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం కనిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో భయంకరమైన దుర్గంధం వ్యాపించడమే కాకుండా, దోమలు విజృంభించి డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబాలతో సహా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు రహదారిపై నుంచి లేచేది లేదని, తక్షణం ఫెర్రీ రోడ్డు వద్ద పోర్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు స్థానికులు చేపట్టిన ఆందోళనతో పోర్టు అధికార వర్గాలు దిగివచ్చాయి. ఏప్రిల్ నాటికి కాలువ వద్ద పనులు పూర్తి చేయిస్తామని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని నివాసితులకు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన కారులు శాంతించారు.



కోటవీధి ఫెర్రీ రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

కనకమహాలక్ష్మికి తులసి దళార్చన



తులసి దళార్చనలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పూర్ణామార్కెట్, మార్చి 16: వన్‌టౌన్ బురుజుపేటలో వెలిసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం తులసీ దళార్చన సేవలు నిర్వహించారు. ఇప్పటివరకు ప్రతి గురువారం నిర్వహించే ఈ సేవను ఇటీవల అధికారులు శనివారానికి మార్చారు. ఉభయదాతలతో అర్చకులు అమ్మవారికి తులసి దళాలతో పూజలు చేయించారు. కాగా ఈ సేవలో పాల్గొనదలచని భక్తులు రూ.1,500 టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని, దంపతులు పూజలో పాల్గొవచ్చని ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పరస

కంచరపాలెం, మార్చి 16: జీవీఎంసీ 55ం వార్డు తిక్కవానిపాలెం వేంకటేశ్వర స్వామి పరస మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది.ఆ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చామర్తి శంకర, జగన్నాథశర్మ, రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు జరిపారు.కంచరపాలెం పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.పరస సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరి అమ్మవారి ఆదివాసం

డాబాగార్డెన్స్, మార్చి 16: సబ్బవరం మండలం యాతపాలెం భువనేశ్వరి అమ్మవారికి ఈ నెల 17న ఆదివారం రావి దళాలతో ఆదివాస ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు స్వయంగా అమ్మవారిని పసుపు, కుంకుమలతో పూజించవచ్చన్నారు.

వైసీపీ బీసీలకు ద్రోహం చేసే పార్టీ

- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



మాట్లాడుతున్న మూర్తియాదవ్, బీజేపీ నేతలు

సీతంపేట, మార్చి 16: నగరంలో మెజారిటీ సామాజికవర్గం యాదవులకు వైసీపీ మొండి చేయి చూపిందని, జగన్ దృష్టిలో బీసీలు అంటే బ్యాక్ బెంచ్ స్టూడెంట్స్‌లా కనిపిస్తున్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విమర్శించారు. పౌరగ్రంథాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ బీసీలకు ద్రోహం చేసే పార్టీ అని ఎద్దేవా చేశారు. యాదవులకు విశాఖలో ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ద్రోహం చేశారన్నారు. వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను బాధ పెట్టారని, అక్కరమాని విజయనిర్మలను నమ్మించి ద్రోహం చేశారని, ఉరుకూటి చందును టికెట్ ఇచ్చే ముందు రోజు తప్పించారన్నారు. మేయర్‌కు గాజువాక సీటు ఇస్తామని నమ్మించారన్నారు. ఉత్తరాంధ్ర యాదవులంతా ఏకమై వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నేత బొట్టా వెంకటరమణ, బీజేపీ నాయకురాలు గంకల కవిత, గంకల అప్పారావు, బుద్దల అనురాధ పాల్గొన్నారు.

వైపీపీకి మాజీ కార్పొరేటర్ జ్యోతి రాజీనామా

జగదాంబ కూడలి, మార్చి 16: దక్షిణ నియోజవర్గం వైసీపీ టికెట్‌ను వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆపార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు శనివారం పార్టీ అధినేత జగన్‌కు లేఖ రాశారు. పార్టీ అభివృద్ధికి ఏళ్లుగా కృషిచేస్తున్నా జీవీఎంసీ 30వ వార్డు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా టికెట్ ప్రకటించినా వాసుపల్లి కుట్ర పన్ని వేరొకరికి కేటాయించారన్నారు. అయినా విజయసాయిరెడ్డి హామీ మేరకు పార్టీలో కొనసాగుతున్నానన్నారు. ఎస్సీ మహిళనైన తాను రాజకీయంగా ఎదిగితే తన ఉనికికే ప్రమాదమన్న దురాలోచనతో వాసుపల్లి తనను అణచివేస్తున్నారన్నారు. వాసుపల్లి నీచ రాజకీయాలతో నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని గుర్తుచేశారు. తన అనుచరులు కూడా పార్టీని వీడుతారన్నారు.

ఎన్నికల సందడి

... 5వ పేజీ తరువాయి

నామినేషన్లు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలిస్తారు. అభ్యర్థుల ఉపసంహరణకు 29 వరకు అవకాశం ఉంది. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎన్నికల ప్రక్రియ మొత్తం పర్యవేక్షిస్తారు. ఇది 24/7 పనిచేస్తుంది. జిల్లాలో 19,71,268 లక్షల మంది ఓటర్లున్నారు. నామినేషన్ల విత్‌డ్రా తేదీకి పది రోజుల ముందు వరకు అంటే ఏప్రిల్ 19 వరకు అర్హులనుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎవరైనా ఉంటే ఫారం-6 దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1991. అదనంగా అనుబంధ కేంద్రాలు మరో 50 ఉన్నాయి.

నగదు రవాణాపై ఆంక్షలు

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నగదు రవాణాపై ఆంక్షలు ఉంటాయి. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి తీసుకువెళ్లకూడదు. వ్యాపార అవసరాల కోసం తీసుకెళితే ముందుగానే అనుమతి తీసుకోవాలి. బ్యాంకు లావాదేవీలపైనా పరిశీలన ఉంటుంది. పది లక్షలు అంతకు మించి అకౌంట్ నుంచి బదిలీ అయినా, జమ అయినా ఎక్కడికి వెళ్లింది?, అనేది ఆరా తీస్తారు. వివరాలు ఐటీశాఖకు పంపుతారు.

ప్రచారంపై ఆంక్షలు

ఎన్నికల ప్రచారం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతిస్తారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, ఇతర ఆస్తులపై ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉంటే తొలగించాలి.

- నామినేషన్లు వేసే వరకు అయ్యే ప్రచార వ్యయాన్ని పార్టీల ఖాతాలో వేస్తారు. ఆ తరువాత అభ్యర్థి ఖాతాలో వేస్తారు. కలెక్టర్ చెప్పిన వివరాల ప్రకారం ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు వరకు ఖర్చు పెట్టవచ్చు.
- మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఎవరైనా సరే ప్రభుత్వం కేటాయించిన వాహనాన్ని వారి ఇంటి నుంచి కార్యాలయం వరకు మాత్రమే ఉపయోగించాలి. ఇతర కార్యక్రమాలకు వాడకూడదు. అలా చేస్తే నిబంధనలు అతిక్రమించినట్టే.
- ప్రభుత్వ అతిథిగృహాలు, కార్యాలయాలను రాజకీయ కార్యక్రమాలకు ఇవ్వకూడదు. ఉపయోగించకూడదు.
- సోషల్ మీడియాలో వచ్చే వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. మత, కులపరమైన అంశాల జోలికి వెళ్లకూడదు.
- మోడల్ కోడ్ అమలును పరిశీలించడానికి జిల్లాలో 94 బృందాలు పనిచేస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, అర్బన్‌లో జోనల్ కమిషనర్లు పర్యవేక్షకులు.

ఐదు చెక్‌పోస్టులు

జిల్లాలో తనిఖీల కోసం ఐదు చెక్‌పోస్టులు పెట్టారు. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఉన్నాయి. అవసరమైతే చెక్‌పోస్టుల సంఖ్య పెంచుతారు. ఆకస్మిక తనిఖీలు కూడా ఉంటాయి. నగదు, మద్యం తరలింపుపై నిత్యం నిఘా ఉంటుంది. ఎవరి దగ్గర ఆయుధాలు ఉంచుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే చాలామందితో డిపాజిట్ చేయించారు. ఇంకా ఎవరైనా చేయకపోతే వెంటనే సరెండర్ చేయాలి.

రాజకీయ సభలకు అనుమతి తప్పనిసరి

రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. ఇప్పటివరకు అధికార పార్టీకే అన్ని రకాల అనుమతులు ఇచ్చి, ప్రతిపక్ష పార్టీలకు నిరాకరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇకపై అలా పక్షపాతంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు చేపడుతుంది. గతంలో చేసినట్టు ఇప్పుడు చేయడానికి లేదు.

ఎన్నికలకు పోలీస్ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

వారికి అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రచారం నిర్దిష్ట సమయంలోగా ముగించాలని రాజకీయ పార్టీల నేతలకు సూచించాలని, నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే నిష్పక్షపాతంగా కేసులు నమోదుచేయాలని అధికారులకు స్పష్టంచేశారు. నగరంలో ఎంతమందికి ఆయుధాలకు లైసెన్స్ జారీ చేశారనే దానిపై ఆరా తీసిన సీపీ వాటన్నింటినీ పోలింగ్ ముగిసేంత వరకూ స్థానిక స్టేషన్‌లో డిపాజిట్ చేసేలా నోటీసులు జారీచేయాలన్నారు. వాటిని డిపాజిట్ చేసేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ల సీఐలదేనని సీపీ స్పష్టంచేశారు. ఇకపై ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేందుకు పోలీస్ శాఖా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై అందరూ దృష్టిసారించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

3 చోట్ల సిట్టింగ్‌లు

... 5వ పేజీ తరువాయి

చూపారు. దీంతో ఆయన్ను ఆరు నెలల కిందట తూర్పు నియోజకర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆయనకే టికెట్ ఖరారుచేశారు. దక్షిణ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు టికెట్ కేటాయించారు. గత ఎన్నికల్లో వాసుపల్లి టీడీపీ నుంచి గెలిచినప్పటికీ పార్టీ ఫిరాయించారు. అప్పటికే దక్షిణలో నాయకులుగా చలామణి అవుతున్న ద్రోణంరాజు శ్రీవాత్సవ్, సీతంరాజు సుధాకర్ వాసుపల్లితో విభేదిస్తూ వచ్చారు. వైసీపీ కార్పొరేటర్లు కూడా వాసుపల్లికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శలు గుప్పించేవారు. ఈ క్రమంలో వాసుపల్లికి టికెట్టు అనుమానమేనని ప్రచారం జరిగింది. అధిష్ఠానం ఊగిసలాడినప్పటికీ చివరికి ఆయనకే ఖరారు చేసింది. ఉత్తర నుంచి కేకే రాజుకు మళ్లీ అవకాశం ఇచ్చింది. గత ఎన్ని కల్లో కేకే రాజు స్వల్ప తేడాతో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతూ వచ్చారు. ఆయనకే రెండోసారి అవకాశం ఇచ్చింది. ఇక గత ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేసి తర్వాత వైసీపీలో చేరిన ఆడారి ఆనంద్ కుమార్‌కు పశ్చిమ టికెట్ కేటాయించింది. గాజువాక నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బరిలోకి దిగనున్నారు. అమర్‌నాథ్ గత ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనకు రెండేళ్ల కిందట మంత్రి పదవి లభించింది. అనకాపల్లిలో గెలిచే పరిస్థితి లేదని తేలడంతో మలసాల భరత్‌ను సమన్వయకర్తగా నియమించింది. అమర్‌నాథ్ చోడవరం, ఎలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో పోటీ చేయాలని ఆసక్తి చూపినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. ఇదే సమయంలో గాజువాకలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిపై వ్యతిరేకత ఉందని అధిష్ఠానం అమర్‌నాథ్ సూచన మేరకు 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు)ను సమన్వయకర్తగా నియమించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, సమన్వయకర్తగా నియమితుడైన చందూకు మధ్య విభేదాలు తారస్థాయికి చేరడంతో అమర్‌నాథ్‌ను ఐదు రోజుల కిందటే సమన్వయకర్తగా నియమించింది. పెందుర్తి నుంచి ఎవరిని పోటీకి దింపుతారనేదానిపై ఉత్కంఠ నెలకొన్నప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌నే పోటీకి దింపాలని నిర్ణయించింది.

రెండోసారి బరిలోకి: పెందుర్తి: పెందుర్తి నుంచి వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మరోసారి పోటీ చేయనున్నారు. ఇరవై మూడేళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చిన అదీప్‌రాజ్ 2006లో పెందుర్తి మండలం రాంపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2007లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. గండి బాబ్జీ, కొణతాల వైసీపీలో చేరడంతో అదీప్‌రాజ్ వారిని అనుసరించారు. గండి బాబ్జీ వైసీపీకి రాజీనామా చేయడంతో నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో బండారుపై విజయం సాధించారు.

వచ్చే ఎన్నికల్లో కూటమిదే విజయం

- మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 16: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని విశాఖ విభిన్న ప్రతిభావంతుల కమిటీ అధ్యక్షుడు ఇసరపు వాసు అన్నారు. పార్టీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయం నుంచి చిలకలూరిపేటలో జరగనున్న సభకు శనివారం బయలుదేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇసరపు అప్పారావు, నమ్మి రవి కుమార్, నరాల బాలకృష్ణ, నారా కిషోర్, శంకర్, వెంకటలక్ష్మి, పార్వతి, సూర్యప్రకాశ్, చంద్రరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం ప్రారంభించిన వంశీకృష్ణ



ఎన్నికల ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: దక్షిణ నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 29వ వార్డు దండుబజారు జంక్షన్ నుంచి ప్రారంభమై ముందుగా సంపత్ వినాయకుని ఆలయం, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, బెల్లం వినాయకుని ఆలయంలో పూజలు చేశారు. జనసేన నాయకులు, యువత, వీరమహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు, దండుబజారు, చందకవీది, అంగటిదిబ్బ, రామజోగిపేట మీదుగా కేజీహెచ్ డౌన్ అవుట్ గేట్ వరకు ర్యాలీ సాగింది. జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, పసుపులేటి ఉషా కిరణ్, బొలిశెట్టి సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు నిరుపమానం





కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల, ఈపీడీసీఎల్ కార్యాలయంలో అమరజీవికి నివాళి

కంచరపాలెం, మార్చి 16: తెలుగు జాతి ఔన్నత్యం కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి, సేవలు నిరుపమానమని కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కావడానికి శ్రీరాములు కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో..

సీతమ్మధార: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం పూలమాల వేసి నివాళి అర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, జె.శ్రీనివాసరావు, రవికుమార్, ఎం.మసిలిమణి, ఎం.రవీంద్ర, కార్పొరేటర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమలులోకి ఎన్నికల కోడ్

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినందున కోడ్ అమలులోకి వచ్చేసిందని, దానిని అంతా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం నుంచే ప్రవర్తన నియామవళి అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని స్పష్టంచేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులు, తాజా పనులకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను 72 గంటల్లో ఎన్నికల సంఘానికి పంపుతామన్నారు. ప్రభుత్వ భవనాలు, వాహనాల వినియోగం, ఎన్నికల వ్యయం, ప్రొటోకాల్ తదితర వ్యవహారాలన్నీ నియమావళికి లోబడి ఉంటాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల ఫొటోలు తొలగించాలని ఆదేశించామన్నారు. జిల్లాలో ఎక్కడా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు లేవని, క్లిష్టమైన కేంద్రాలు మాత్రం 478 గుర్తించామని చప్పారు. జిల్లాలో 1,941 పోలింగ్ కేంద్రాలు, మరో 50 అనుబంధ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. ఈ నెల 16వ తేదీ నాటికి జిల్లాలో 19,71,268 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశామన్నారు. పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో వచ్చిన రాజకీయ ప్రకటనలు పరిశీలించేందుకు ఎంసీఎంసీ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న రాళ్లు

నిరుపయోగంగా భూ సర్వే రాళ్లు

పద్మనాభం (రూరల్), మార్చి 16 : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే మండలంలో అభాసుపాలవుతోంది. సర్వే కోసం తీసుకువచ్చిన రాళ్లు డొంకలు, తుప్పల్లో నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. గత ఏడాది నవంబరులో భూముల రీసర్వే ప్రారంభించగా అనంతరం శ్రద్ధ కొరవడింది. రీసర్వేలో సిబ్బంది లీలలు ఒక్కొక్కటిగా బయటపడడంతో ప్రజాప్రతినిధులు, రైతులు అవాక్కవుతున్నారు.సర్వే కోసం మండలానికి తీసుకువచ్చిన 13 వేల రాళ్లు ఎక్కడపడితే అక్కడ వదిలేసి తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అనంతవరం, కొవ్వాడ, బాందేవుపురం తదితర గ్రామాల్లో రాళ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. స్థానికులు ఈ రాళ్లను సొంత అవసరాలకు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది.

నేడు ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, మార్చి 16 : జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి కూడలిలో ఉన్న సద్గురు సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు రుద్రరాజు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, సాయంత్రం ఐదు నుంచి విశేష అర్చనలు, పల్లకీ సేవ, సామూహిక దీపాలంకరణ చేపడతామని చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

చిన్నారులకు టీకా తప్పనిసరి

ఆనందపురం, మార్చి 16 : మండలంలోని మిందివాని పాలెంలో జాతీయ టీకా దినోత్సవం పురస్కరించుకుని విశ్వనాథ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది చిన్నారులకు టీ వేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి గ్రామస్థులకు తెలిపారు. చిన్నారులకు టీకా వేయించడం వల్ల ఏడు రకాల వ్యాధులు దరి చేరవని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఉమాదేవి, ఎర్నికుమారి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, మార్చి 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం సహస్రనామ తులసీ దళార్చన సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జర్నలిస్టుల నిరసన

సిరిపురం, మార్చి 16 : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు తగిన న్యాయం చేసే వరకు ఉద్యమం ఆగదని ఎల్ఎన్‌పి అధ్యక్షుడు పి. సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు దాడుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు జర్నలిస్టుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అమలు చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, సీపీఎం నాయకుడు కుమార్, ఎం. వెంకటేశ్వర్లు, కె. చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 38, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారేట్ 24, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 130, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 90, కీరదోస 26, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50,కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	196
స్కిన్‌లెస్	--	206

'కోడ్' కూసింది!

పద్మనాభం, మార్చి 16 : కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈమేరకు అధికారులు మండల కార్యాలయాల భవనాల బోర్డులపై ఉన్న ప్రజాప్రతినిధుల ఫొటోలను మూసివేశారు. అలాగే ప్రధాన రహదారులపై ఉన్న నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్టీఆర్, వైఎస్సార్ విగ్రహాలను వస్త్రాలతో కప్పివేశారు. విద్యుత్ స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలను తొలగించారు. పద్మనాభంలో సత్వరమే ఎన్నికల కోడ్ అమలు చేసినా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, గ్రామాల్లో వేసిన శిలాఫలకాలపై ఉన్న ప్రజాప్రతినిధుల ఫొటోలను మూసివేయాల్సి ఉంది. కాగా ఎన్నికల కోడ్‌ను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించేలా గ్రామస్థాయి ఉద్యోగుల సహకారం తీసుకోవాలని మండల ఎన్నికల కోడ్ చూసే అధికారులు ఆదేశించారు.



పద్మనాభంలో ఎన్టీఆర్, వైఎస్సార్ విగ్రహాలను వస్త్రాలతో మూసివేస్తున్న దృశ్యం

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం

- టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు
- భీమిలిలో మూడు పార్టీల సమావేశం

భీమునిపట్నం, మార్చి 16 : వైసీపీ అరాచక, అవినీతి పాలనను అంతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బ్యాంక్ కాలనీ సమీపంలో వున్న అనిల్ గార్డెన్స్‌లో మూడు పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్నదమ్ములు, కుటుంబాల మధ్య చిచ్చుపెడుతూ గ్రామాల్లో విభజన రాజకీయాలు చేస్తున్న వైసీపీకి చెక్ పెట్టాలంటే స్థానిక నాయకత్వంతోనే సాధ్యమని చెప్పారు. కూటమిలో స్థానిక నాయకుడు ఏ ఒక్కరిని ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించినా అందరూ గెలుపునకు సహకరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి దృష్ట్యా మిత్ర పక్షాలన్నీ ఉమ్మడిగా ఎన్నికలకు వెళ్తున్నాయని తెలిపారు. బీజేపీతో కలవడం వల్ల టీడీపీకి మైనార్టీలు దూరమవుతారన్న వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్రానికి ఐదేళ్లుగా పట్టిన గ్రహణం విడిచిందన్నారు. మూడు పార్టీల కూటమితో వైసీపీ పతనం ప్రారంభమైందని, అది భీమిలి నుంచే ఆరంభమవుతుందన్నారు. కాగా పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు మాట్లాడుతూ కార్యకర్తల కష్టంలో తానున్నానని ధైర్యం నింపిన కోరాడ రాజబాబు నాయకత్వాన్ని పార్టీ అధిష్ఠానం గుర్తించాలని, ఆయనకు పార్టీ టికెట్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కోట్ని బాలాజీ, నాయకులు డీఏఎస్ రాజు, కాళ్ల నగేష్‌కుమార్, కశిరెడ్డి దామోదర్, కురిమిన లీలావతి, బోయి రమాదేవి, జనసేన నాయకులు శ్రీకాంత్, అక్కరమాని దివాకర్, పరిమి భువనేశ్వరి, పాల్గొన్నారు.



సమావేశంలో చేతులు కలిపి సంఘీభావం తెలుపుతున్న నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : వెలగపూడి

వెంకోజీపాలెం, మార్చి 16 : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శనివారం సాయంత్రం 17వ వార్డు కొత్తవెంకోజీపాలెం ప్రాంతంలో టీడీపీ నాయకులు భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టనున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాళ్ల శంకర్, కాళ్ల లలిత, బోర ధనరెడ్డి, ఆడారి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు దీనదయాళపురం నుంచి 12వ వార్డు కొండవాలు ప్రాంతం వరకు టీడీపీ నాయకులు శనివారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12, 13వ వార్డుల అధ్యక్షులు గాడి సత్యం, పొత్రకండ ధర్మారావు, పోతిన భరత్, యల్లమిల్లి సురేష్, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, బుడుమూరి గోవింద్, రాగతి అచ్యుత్‌రావు, ముగడ రాజారావు, తురకపూడి బాలస్వామి,మజ్జి రమణి, నాళ్ళని వరలక్ష్మి, కేతా సత్యనారాయణ, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



13వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరిస్తున్న వెలగపూడి

ప్రజా సేవకు అంకితమైన వ్యక్తి

విశాలాక్షినగర్ : ప్రజా సేవకు అంకితమైన వ్యక్తి వెలగపూడి అని ఆయన సతీమణి వెలగపూడి సుజన అన్నారు. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ, విశాలాక్షినగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ వెలగపూడిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమ, రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, దేవి, దీప, సబిత, సుజాత పాల్గొన్నారు.

కుటుంబ కథా చిత్రం 'ఓమ్ భీమ్ బుష్'

ఎంవీపీ కాలనీ, మార్చి 16 : ఓమ్ భీమ్ బుష్ కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అని ఆ చిత్ర హీరో శ్రీవిష్ణు అన్నారు. శనివారం ఆయన గాదిరాజు ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యులాయిడ్ బ్యానర్‌పై శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్, రామకృష్ణ హీరోలుగా నటించిన ఈ సినిమా ఈనెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ సామజవరగమన చిత్రం ఉత్తరాంధ్రలో మంచి ఆదరణ పొందిందన్నారు. ఆ చిత్రంతో పోలిస్తే మూడు రెట్లు ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాలో ఉంటుందని చెప్పారు. నలుగురు స్నేహితుల కథ అని, ఆరుగురు హీరోయిన్లు నటించారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్ సర్వీసులు

సింహాచలం, మార్చి 16 : నగరంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిపో పరిధిలోని పెందుర్తి కూడలి నుంచి నగరంలోని ద్వారకా బస్‌స్టేషన్ వరకు ఐదు సర్వీసులను నడపనున్నట్టు చెప్పారు. అలాగే పరీక్షల హాల్ టికెట్లు ఉన్న విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ప్రతి బస్సులోనూ ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు.

ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభం



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం (రూరల్)/కొమ్మాది, మార్చి 16 : మండలంలోని తీర ప్రాంత గ్రామమైన అన్నవరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ గ్రామం ఈశాన్యంలో ఉండడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారాలను ఇక్కడి నుంచి ప్రారంభిస్తుంటారు. శ్రీనివాసరావు కూడా ఈ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. తొలుత మత్స్యకార మహిళలు బిందెలతో ఊరేగింపు జరిపి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కూడా బిందెతో సముద్రంలోకి వెళ్లి అక్కడ గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. కాగా 5, 6, 7, 8 వార్డుల నాయకులు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం నుంచి భారీ ర్యాలీగా అన్నవరం గ్రామానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు, బొట్టా అప్పలరాజు, పోతిన ఎల్లాజీ, పిళ్లా రమణ, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, సూరిబాబు, బగాది లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడండి

వెంకోజీపాలెం, మార్చి 16 : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బైక్‌లు, కార్లతో పరీక్షా కేంద్రాలకు వచ్చే వారిని పోలీసులు ఆపడం వంటి చర్యలు చేపట్టరాదన్నారు. ఏ ఒక్క విద్యార్థి ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల పరీక్ష రాయలేకపోయారన్న మీమాంస తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీసు అధికారులకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన చెప్పారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టిసారించండి : తహసీల్దార్

పద్మనాభం (రూరల్), మార్చి 16 : అధికారులు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని తహసీల్దార్ ఎన్. వెంకటరావు సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈఓ

భీమునిపట్నం, మార్చి 16 : మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఎంఈఓ శివరాణి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుంచి ఈనెల 30 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ జరిగే ఈ పరీక్షలకు మొత్తం 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1343 మంది పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు.

ఏయూను సందర్శించిన ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్

వెంకోజీపాలెం, మార్చి 16 : ఏయూను ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కువ మంది విదేశీ విద్యార్థులు ఏయూలో చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని, ఏయూలో కల్పిస్తున్న వసతులు, బోధన తదితర అంశాలను వారిని ఆకట్టుకుంటున్నాయన్నారు. వీసీ మాట్లాడుతూ విదేశీ విద్యార్థుల సంఖ్యను రెండు వేలకు పెంచడం లక్ష్యంగా మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు, అసోసియేట్ డీన్ ఆచార్య ఈశ్వర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మ తొలేళ్లు ఉత్సవం

వెంకోజీపాలెం, మార్చి 16 : జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెం యల్లమాంబ నగర్‌లో వేంచేసి ఉన్న యల్లమ్మ తల్లి తొలేళ్ల ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. మహిళలు ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు వారణాసి విశాలాక్షి, కార్యదర్శి కాళ్ల కుమార్, ఇతర సభ్యులు అమ్మవారికి తొలి పూజ నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ అర్చకుడు సంతోష్ శర్మ భక్తుల పేరిట అభిషేకాలు నిర్వహించారు. బుధవారం అమ్మవారి జాతరలో భాగంగా తెల్లవారుజాము నుంచి పూజలు, సాయంత్రం అమ్మవారి విగ్రహం ఊరేగింపు, పరస జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మూర్తిరాజు, కోఆర్డినేటర్ కాళ్ల అప్పలరాజు, సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి పరదశి, తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

కొమ్మాది, మార్చి 16 : దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదం, హోమియో వైద్యం ద్వారా నయం చేయవచ్చునని ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిర్రా విశాలాక్షి అన్నారు. శనివారం అయోధ్యనగర్‌లో ధాత్రి ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ఆయుష్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. వైద్యులు ఆర్. వెంకట్రావు, ఎం. సుమ, బి. ప్రతిభ వంద మంది రోగులను పరీక్షించి ఆరోగ్య సూచనలతో పాటు మందులు అందించారు.

కోడి పందెలు ఆడుతున్న ఐదుగురు అరెస్టు

పద్మనాభం, మార్చి 16 : కోడి పందెలు ఆడుతున్న ఐదుగురిని శనివారం అరెస్టు చేసినట్టు పద్మనాభం ఎస్సై జె. సురేష్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బాందేవుపురం మామిడితోటలో కోడి పందెలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లిదాడి చేయగా ఐదుగురు పట్టుబడడంతో పాటు రూ.720 నగదు,నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిపై ఏపీ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మార్చి 16 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం వేకువజాము నుండే కొండదిగువ వరాహ పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి భైరవ స్వామిని దర్శించుకుని అమృత కలశాల మొక్కులు తీర్చుకున్నారు.అక్కడి నుంచి మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకుని తలనీలాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీ వల్ల దేవస్థానానికి చెందిన అన్ని విభాగాల ద్వారా మొత్తం రూ. 20 లక్షల మేర ఆదాయం అప్పన్న ఖజానాకు సమకూరింది. అత్యధికంగా శ్రీఘ్రదర్శనం, అతి శ్రీఘ్రదర్శనం టికెట్ల విక్రయాల ద్వారా రూ.9.2 లక్షలు, పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.6.72 లక్షలు ఆదాయం లభించింది. కాగా దేవస్థానం పరిధిలో జరగాల్సిన ఆన్‌లైన్ లావాదేవీలన్నీ నెట్‌వర్క్ సమస్య వల్ల సర్వర్ పనిచేయక నిలిచిపోయాయి. దీంతో సేవలన్నీ ఆఫ్‌లైన్‌లో చేయాల్సి రావడంతో అటు భక్తులు, ఇటు దేవస్థానం సిబ్బంది నానా అవస్థలు పడ్డారు.



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, మార్చి 16 :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీనంలో నడుస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి సుజాతనగర్ ప్రాంతానికి చెందిన బొడ్డు నాగేశ్వరరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను నగదు రూపంలో శనివారం దేవస్థానం ఏఈఓ పాలూరి నరసింగరావుకు అందజేశారు.



పల్లాను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర భవిత కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

- టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదవాల్తేరు, మార్చి 16 : రాష్ట్ర భవిష్యత్తు, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా పని చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. శని వారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ విశాఖపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు తాను గాజువాక నుంచి పోటీ చేస్తున్నానని, నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్త లను కలిసినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ మూడు పార్టీల సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. రవీంద్ర మాట్లాడుతూ త్వరలోనే నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పొలిమేర శ్రీనివాస్, దానేష్, కృష్ణంరాజు, దుర్వాసుల శర్వాణి, బీజేపీ కన్వీనర్ కరణం నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అనంత పద్మనాభుని పెళ్లి రాట

పద్మనాభం, మార్చి 16 : పద్మనాభంలోని అనంత పద్మనాభుని కల్యాణోత్సవాలు ఈనెల 21 నుంచి నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెళ్లి రాట వేయనున్నట్టు దేవస్థానం అధికారులు చెప్పారు. స్థానిక కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణ వద్ద ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

అభివృద్ధి పనుల్లో అక్రమాలు

విశాఖపట్నం, మార్చి 16 : జీవీఎంసీ 8వ వార్డులో జరుగుతున్న రహదారుల నిర్మాణాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని వైసీపీ నాయకుడు, ఎండాడ మాజీ సర్పంచ్ చెన్నా దాసు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీలో ఎంతోమంది రిటైర్డ్ కాని ఇంజనీరింగ్ ఏఈలు ఉండగా 8వ వార్డులో రిటైర్డ్ అయిన ఏఈ శ్రీధర్‌ను ఏవిధంగా నియమించారని ప్రశ్నించారు. వార్డులో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భారీగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రుషికొండ తారక రామ లేఅవుట్‌లో జనం లేని చోట ఉన్న పార్కును రూ. 3 కోట్లతో అభివృద్ధి చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. అలాగే రుషికొండ, తదితర ప్రాంతాల్లో రూ. 11 కోట్లతో జనం లేని చోట రహదారులు వేస్తున్నారని చెప్పారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ఉండాలి : వీసీ

సాగర్‌నగర్, మార్చి 16 : ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సూచించారు. శనివారం ఆయన గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పిజి కళాశాలలో 2018-21 విద్యార్థుల స్నాతకోత్సవంలో మాట్లాడారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయ తీరానికి చేరుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పట్టభద్రులైన విద్యార్థులకు ఆయన పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య పీవీ శర్మ, కళాశాల వైస్ ప్రెసిడెంట్ డి. దక్షిణామూర్తి, ఆచార్య కేఎస్ బోస్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకర రజని, ఆచార్యులు మురళీ సోమేశ్వరరావు, డీవీఎస్ కామేశ్వరరావు, ప్రగడ రాజ గణపతి, పి. సోమరాజు, బి. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 198 కేసులు పరిష్కారం

భీమునిపట్నం, మార్చి 16 : భీమిలి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 198 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ పి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలోను, భీమిలి 1వ అదనపు, 2వ అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టుల్లో మెజిస్ట్రేట్ డి. సోని ఆధ్వర్యంలోనూ లోక్ అదాలత్‌లు నిర్వహించారు. ఇందులో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో కాంపౌండబుల్ కేసుల్లో ఇరువర్గాలు రాజీకి రావడంతో పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

ఆరిలోవ, మార్చి 16 : బాలాజీ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో క్షయ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్షయ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, క్రమ పద్ధతులో మందులు వాడితే నయం అవుతుందని చెప్పారు. ముఖ్యంగా ధూమ పానం, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


సిరిపురం , మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు అని వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి అన్నారు. శనివారం సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో పొట్టి శ్రీరాముల జయంతి నిర్వహించారు.ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్ర మౌళి మాట్లాడుతూ 1951లో నెల్లూరు జిల్లాలో జన్మించిన పొట్టి శ్రీరాములు 58 రోజులు చేపట్టిన ఆమరణ దీక్ష ఫలితమే ఆంధ్రరాష్ట్రం అవతరణ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, సీఏఓ హరిప్రసాద్, ఎస్ఈ బాలరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటి పూట బడులు

పద్మనాభం (రూరల్), మార్చి 16 : మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సోమ వారం నుంచి వచ్చే నెల 23 వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని ఎంఈఓ రమణ ఆదేశించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలు నిర్వహించాలని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో ప్రమాదం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16 : స్టీల్‌ప్లాంట్‌లోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్) -2లో శనివారం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. విభాగంలోని ఎల్‌బీ బేలో ద్రవపు ఉక్కు తీసుకువెళుతున్న ల్యాడిల్ కింద భాగానికి రంధ్రం పడడంతో అందులో ఉన్న ద్రవపు ఉక్కు నేలపాలైంది. ఆ సమయంలో అక్కడ స్వల్పంగా మంటలు చెలరేగాయి.



ప్రమాద స్థలిలో మంటలు